క్లుప్తంగా

కేంద్ర మాజీ మంత్రికి స్వాగతం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌కు ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు విమానాశ్రయంలో ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావుతో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లో కేంద్ర మాజీ మంత్రితోపాటు ప్రభుత్వ సలహాదారుతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేంద్రమంత్రితో కలిసి చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొదల తొలగింపు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని రేపల్లెవాడలో జీపీ సిబ్బంది ఆదివారం పొదలను తొలగించారు. గ్రామం నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న దారిలో రోడ్డుకు ఇరువైపులా పొదలు పెరిగిపోవడంతో వాహనదారుల ముఖాలకు తగలడంతో జీపీ సిబ్బంది పొదలను తొలగించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలను తీసుకున్నారు.

ఇస్రో సందర్శనకు విద్యార్థిని ఎంపిక



భిక్కనూరు: అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని సందర్శించేందుకు పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన విద్యార్థిని లక్ష్మీ ప్రసన్న ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న దేవి తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇస్రో సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. అందులో బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని లక్ష్మీ ప్రసన్న పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఆమె అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని సందర్శనకు అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

'మేఘ విచ్ఛేదనం' పుస్తకావిష్కరణ



కామారెడ్డి అర్బన్: రచయిత యెనిశెట్టి గంగాప్రసాద్ 'మేఘ విచ్ఛేదనం' (కల్లోల కామారెడ్డి వికృత రూపం) గేయ పద్య కవితా సంపుటి ద్వారా కామారెడ్డి ప్రజల హృదయ వేదనను తెలియజేశారని గజల్ కవి సూరారం శంకర్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘంలో మేఘ విచ్ఛేదనం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. సభలో తెరవే జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్, పుస్తక రచయిత యెనిశెట్టి గంగాప్రసాద్ తదితరులు మాట్లాడారు. తెరవే ప్రతినిధులు గంగాప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ప్రతినిధులు మోహన్‌రాజ్, పీతాంబర్, శ్యాం కుమార్, కాశ నరసయ్య, తిరుపతిరావు, సంగాగౌడ్, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బాధిత కుటుంబాలను కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తనయుడు గంప శశాంక్ ఆదివారం పరామర్శించారు. పలు కారణాలతో గ్రామానికి చెందిన పలువురు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోపాల్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధిరామిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ భిక్షపతి, నాయకులు మల్లేశం, యాదగిరి, రాజయ్య, రాజిరెడ్డి, సుధాకర్ రెడ్డి, సిద్ధిరాములు తదితరులున్నారు.

'ట్రామాకేర్' ఏర్పాటుకు ప్రతిపాదనలు

- సెంటర్‌తో క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం
- ఫత్లాపూర్ వద్ద ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి



నేషనల్ హైవేపై పెద్దకొడప్‌గల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్ మండలాల మీదుగా ఎస్ఎస్ఏ నేషనల్ హైవే ఉంది. ఈ రోడ్డు గుండా ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. అక్కడక్కడ వాహనాలతో ప్రమాదం జరిగి తక్షణ వైద్య సహాయం అందక ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయిన ఘటనలున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బిచ్కుంద మండలం ఫత్లాపూర్ వద్ద ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించాలని నిర్ణయించారు.

నెలలో జరుగుతున్న ప్రమాదాలు, మరణాలు, క్షతగాత్రులకు సంఖ్య సేకరించి ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ప్రభుత్వం వారం రోజుల కింద జాతీయ రహదారులపై అక్కడక్కడ రాష్ట్రంలో 74 ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపింది. అలాగే ఒక్కో సెంటర్ నిర్మాణానికి రూ. 5.34 కోట్లు కేటాయిస్తామని ప్రకటించింది. జుక్కల్ నియోజకవర్గానికి ట్రామా సెంటర్ మంజూరైతే ఫత్లాపూర్ వద్ద ఏర్పాటుకు స్థలం పరిశీలించి అనుకూలంగా ఉందని అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు.

24 గంటలపాటు అందుబాటులో వైద్యులు..

ట్రామాకేర్‌లో ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, స్పెషలిస్టు వైద్యులు ఇతర విభాగాల వైద్య సహాయక సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ట్రామాకేర్‌కు తరలిస్తారు. అత్యవసరాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్యులు వీలైనంత త్వరగా వైద్యం అందించి ప్రాణాలను రక్షించడానికి తనవంతు కృషి చేస్తారు. ట్రామా ఏర్పాటుతో ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చు. జాతీయ రహదారులపై ట్రామా సెంటర్ 30 నుంచి 35 కిలోమీటర్లకు ఒకటి ఉండాలి. మద్నూర్ మండలం మహారాష్ట్ర సరిహద్దు నుంచి నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా, మాసన్‌పల్లి వరకు సుమారు 60 కిలోమీటర్ల వరకు నేషనల్ హైవే ఉంది. బిచ్కుంద మండలం ఫత్లాపూర్ వద్ద ట్రామా సెంటర్ ఉంటే మధ్యలో ఉంటుందని నిర్ణయించి నివేదిక పంపించారు. ట్రామాకేర్ సెంటర్‌తో 24 గంటల పాటు వైద్యం అందుతుందని ప్రజలు అంటున్నారు.

జుక్కల్‌కు మొదటి ప్రాధాన్యత



జుక్కల్ గుండా 60 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి గత ఏడాది ట్రామాకేర్ సెంటర్ కోసం ప్రతిపాదనలు పంపించాం. ట్రామా సెంటర్ మంజూరులో జుక్కల్‌కు మొదటి ప్రాధాన్యత ఉంది. త్వరలోనే జుక్కల్‌కు ట్రామా సెంటర్ మంజూరు కానుంది. ఫత్లాపూర్ వద్ద స్థలం పరిశీలించాం.

– తోట లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే, జుక్కల్

కుల సంఘాలు ఐక్యతతో ఉండాలి

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

బీబీపేట: గ్రామాల్లో కుల సంఘాలు ఐక్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం పెద్దమ్మ ఆలయం వద్ద తాను సొంత నిధులతో నిర్మించిన ఆలయ కమాన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టేందుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో కుల వృత్తుల ద్వారానే జీవనం గడుపుతున్నారని దాని కోసమే కులాలు బలంగా ఉండాలని తెలిపారు. కులంలో ఏ ఒక్కరికి సమస్య వచ్చినా అందరు తోడుగా ఉండాలని, దాని కోసమే కుల సంఘాలు ఒక్కతాటిపై నడవాలని సూచించారు. అలాగే కుల సంఘాలకు గ్రామ గ్రామాన అభివృద్ధి పనులు చేస్తున్నామని మున్ముందు కూడా మరిన్ని అభివృద్ధి పనులతో ముందుకు వెళ్తానని అన్నారు. ముదిరాజ్ సంఘం సదర్ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మద్నూర్(జుక్కల్): ప్రస్తుతం సోయా, వరి పంట రాశులు రావడంతో రైతులు ధాన్యం గింజలను రహదారులపైనే ఆరబెడుతున్నారు. కాని పంటకు రక్షణగా పెద్ద పెద్ద రాళ్లు పెట్టడంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు పేర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో రహదారిపై గల రాళ్లను గమనించని వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారినపడే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. రహదారిపై రాళ్లను తొలగించాలని కోరుతున్నారు.

కనీసం మరమ్మతులైనా చేపట్టరూ..!



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చిట్యాల నుంచి సోమారం గ్రామానికి వెళ్లే రోడ్డు పలు చోట్ల కోతకు గురైంది. రెండు సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు పలు చోట్ల ధ్వంసమైంది. అక్కడక్క రోడ్డుపై గుంతలు పడడంతో ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని అధ్వానంగా తయారైన ఈ రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.

టపాసుల దుకాణాల వద్ద సందడి



సంగోజీపేట్‌లో టపాసుల దుకాణం వద్ద చిన్నారులు



తాడ్వాయిలో వెలసిన దుకాణాలు



ఎల్లారెడ్డిలో ఏర్పాటు చేసిన దుకాణాలు



ఎల్లారెడ్డిలో పూలు విక్రయిస్తున్న మహిళలు



ముస్తాబైన బీబీపేటలోని పెద్దమ్మ ఆలయం

సాక్షి, నెట్‌వర్క్: దీపావళి అంటేనే టపాసుల పండుగ. చిన్నాపెద్దా తేడా లేకుండా టపాసులు కాలుస్తూ పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకుంటారు. దీంతో పట్టణంతో పాటు పల్లెల్లోనూ రకరకాల టపాసులతో దుకాణాలు ఏర్పాటు చేశారు. చిన్నారులు తమకెంతో ఇష్టమైన రకరకాల టపాసులు కొనుగోలు చేస్తుండటంతో దుకాణాల వద్ద సందడి నెలకొంది. అలాగే పూలు, పండ్లతో పాటు వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. లక్ష్మీ పూజలో భాగంగా అమ్మవారికి పూజలు చేసేందుకు జనాలు బంతిపూలు, దీపంతాలను కొనుగోలు చేశారు. పండుగ సందర్భంగా ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు.

అనుమతులు లేకుండానే విక్రయాలు



పద్మాజీవాడి చౌరస్తాలో టపాసుల దుకాణం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పద్మాజీవాడి చౌరస్తాలో ఎలాంటి అనుమతులు లేకుండానే దుకాణాల్లో టపాసులను విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయి. అనుమతులు లేకుండా గ్రామాల్లో టపాసులను విక్రయిస్తున్నప్పటికి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భారీ ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేని టపాసుల దుకాణాలను వెంటనే మూయించాలని కోరుతున్నారు.

దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలి



ఎల్లారెడ్డి: దీపావళి పండగను సంతోషంగా జరుపుకోవాలని ఫైర్ ఆఫీసర్ వినోద్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి ఫైర్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. విశాలమైన ప్రదేశంలో కాల్చాలని, కాల్చే సమయంలో దుస్తులు బాణాసంచాకు తగలకుండా చూడాలని అన్నారు. ఎల్లారెడ్డి ఫైర్ స్టేషన్ పరిధిలో 16 టపాకాయల దుకాణాలకు అనుమతులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఎల్లారెడ్డిలో 12, నాగిరెడ్డిపేటలో 4 దుకాణాలకు అనుమతులు ఉన్నాయన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్ర భవనంలో పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఎంఈవో రామస్వామి తెలిపారు. రెండో విడతలో భాగంగా 4,725 పుస్తకాలు వచ్చాయన్నారు. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. గణితం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం, జీవశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీసుకుపోవాలని కోరారు.

ప్యాడీ డ్రైయ్యర్‌పై ఆసక్తి



బాన్సువాడ రూరల్: పచ్చి ధాన్యాన్ని గంటల్లో ఆరబెట్టే ప్యాడీ డ్రైయ్యర్‌పై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. 2 గంటల్లో 25 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం ఉండటంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. సుమారు 80 నుంచి 100 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద ధాన్యాన్ని ఆరబెడుతుంటంతో తేమశాతం సులువుగా తగ్గిపోతోంది. పచ్చిధాన్యాన్ని, తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు పడుతున్న కష్టాలను గుర్తించి వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీలకు వీటిని సరఫరా చేసింది. యంత్రం ద్వారా సత్ఫలితాలు వస్తుండటంతో సహకార సంఘాలు సైతం ప్యాడీ డ్రైయ్యర్ యంత్రాల కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. గ్రామాల్లో యంత్రాలు అందుబాటులోకి వస్తే ధాన్యం ఆరబెట్టడానికి అయ్యే తాటిపత్రులు, కూలీల ఖర్చులు తగ్గడంతో పాటు ప్లాట్‌ఫారాల సమస్య తీరుతుందని రైతులు అంటున్నారు.

నిందితుడిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో ఆదివారం సాయంత్రం యువత ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచి చంపిన నిందితుడు రియాజ్‌ను వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని నినాదాలు చేశారు. మండల యువకులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం ఇండ్లు కూలిపోయిన బాధితులకు హుమిలిటీ, హుమానిటీ, ఇంటిగ్రిటీ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఇండ్లు కూలిపోయి నష్టపోయిన బాధితులకు నిత్యావసర వస్తువులు, రగ్గులతో పాటు బియ్యాన్ని అందజేశారు.

గుట్ట తవ్వకం పనుల అడ్డగింత



తవ్వకం పనులను అడ్డుకున్న పోచారం గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జాతీయ రహదారి–765డి ఏర్పాటు పనులు చేపట్టిన కేపీసీ సంస్థ సిబ్బంది నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామశివారులో గల ఏనెగుట్ట వద్ద ఆదివారం చేపట్టిన తవ్వకం పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గుట్ట వద్దకు చేరుకున్న గ్రామస్తులు మొరం తవ్వకం పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి ఒకపక్క ఉన్న ఏనెగుట్టను కేపీసీ సంస్థ సిబ్బంది ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకం పనులు చేపట్టారన్నారు. దీనివల్ల ఇటీవల కురిసిన భారీవర్షాల మాదిరి భవిష్యత్తులో మళ్లీ కురిస్తే గ్రామానికి వరద ముంపు సమస్య తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామశివారులో ఉన్న గుట్ట వద్ద తవ్వకం పనులను చేపట్టవద్దని, తవ్వకం పనులను కొనసాగిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మాజీ సర్పంచ్‌లు నర్సాగౌడ్, గోపాల్‌గౌడ్, వీడీసీ సభ్యులున్నారు.

బస్టాండ్‌లో తప్పిన ప్రమాదం



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ స్లాబ్ పెచ్చులూడిపోయి కిందపడ్డాయి. ప్రయాణికులు లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. శనివారం రాత్రి 9 గంటలకు స్లాబ్ పెచ్చులు ఊడి కిందబడ్డాయి. 40 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ శిథిలావస్థలకు చేరింది. ఆర్టీసీ అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో వర్షం నీళ్లు ఆగి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. జుక్కల్, మద్నూర్, దెగ్లూర్, బీదర్ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ప్రతి రోజూ వందల మంది రాకపోకలు సాగిస్తారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వాన స్థితికి చేరిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలి



భిక్కనూరు: మండల కేంద్రంలో గల సిద్ధిరామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరు కావాలని కమిటీ అధ్యక్షుడు తాటిపాముల లింబాద్రి కోరారు. ఆదివారం హైదరాబాదులో మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌తో పాటు హైకోర్టు ప్రముఖ న్యాయవాది పెద్దబచ్చగారి రామ్ రెడ్డిలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. అనంతరం లింబాద్రి మాట్లాడుతూ.. ఈ నెల 22న ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశామని, అతిథులుగా హాజరు కావాలని కోరారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, సుదర్శన్, మైపాల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి ఉన్నారు.

ఆటోస్టాండ్ కాదు బస్టాండ్!



నిజాంసాగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటోవాలాలు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రైవేట్ ఆటోలకు అడ్డాగా మారింది. జిల్లా కేంద్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ఆటోలు బస్టాండ్‌లో తిష్ట వేస్తున్నాయి. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూస్తుండటంతో ఆటో డ్రైవర్లు తమ వాహనాలను బస్టాండ్‌లోకి తీసుకెళ్లి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లోకి ఆటోలు నిలుపుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలు, ఆటో డ్రైవర్ల ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కమ్మేసిన మంచు దుప్పటి



మహమ్మద్‌నగర్- గున్కుల్ శివారులో కమ్మేసిన మంచు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంతో పాటు చుట్టు ప్రక్క గ్రామాలను ఆదివారం ఉదయం మంచు కమ్మేసింది. ఉదయం 7 గంటలు దాటినా మంచు కారణంగా పరిసరాలు కనిపించలేదు. దట్టమైన పొగమంచులా కప్పేయడంతో మార్నింగ్ వాక్ వెళ్లే వారితో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సంక్షిప్తం

అల్లుకున్న నిర్లక్ష్యం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలోని ఓ విద్యుత్ స్తంబానికి పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, తీగలను తొలగించడంలో అలసత్వం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



కామారెడ్డి రూరల్: ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన మచ్చ భూమయ్య, కడారి రొద్ద మల్లయ్య, దుబ్బాక ఎల్లవ్వ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి వారి కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే దివ్యాంగుడిగా ఎన్నో రోజుల నుంచి బాధపడుతున్న షేక్ షరీపోద్దీన్‌కు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసి ఆయనకు ఎలక్ట్రికల్ స్కూటీని బుక్ చేసినట్లు తెలిపారు. అలాగే గ్రామంలో అనాధ వృద్ధురాలైన ముత్తవ్వకు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట తాజా మాజీ కౌన్సిలర్ పంపరి శ్రీనివాస్, జూలూరి సుధాకర్, పిడుగు సాయిబాబా, చాట్ల వంశీ, శంకర్ రావు, మామిండ్ల రమేష్, నిమ్మ విజయ్ కుమార్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకులు గౌరు నవీన్ కుమార్, మదాని శంకర్, కడారి చిన్న మల్లేష్, చెట్కూరి చిన్న సాయిలు, మచ్చ లింగం, గంగరాజు, చెట్కూరి నర్సింలు, పర్శరాములు, దుబ్బాక నడిపి రాజు, దుబ్బాక దత్తు, షేక్ అజీజ్, కొప్పుల స్వామి, చెట్కూరి ప్రణీత్, చెట్కూరి జీమ్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజీపేట గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు భీమ్ రావు సమక్షంలో గ్రామానికి చెందిన కాశీరాం, గోపాల్, సాయిలు, గంగారాం, నారాయణ, సాయిలు, చిన్న సాయిలుతో పాటు పలువురు పార్టీలో చేరారు.